క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లచెరువు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వాగ్దేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెటీరియల్ పంపిణీ

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల బీసీ వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఏబీసీడబ్ల్యూఓ గంగాద్రి, హెచ్‌డబ్ల్యూఓ ఆంజనేయులు నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నాణ్యమైన వసతి, భోజన వసతితో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు మెటీరియల్ దోహదపడుతుందన్నారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నరసింహులు, వేమయ్య, సురేష్, లక్ష్మానాయక్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

నల్లచెరువు: ఓరువాయి గ్రామం, సానేవారిపల్లిలో నిర్వహించనున్న సీతారాముల చెక్కల భజన, గజ్జెల పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి రూ.10 వేల విరాళాన్ని శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డి చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు.

15న మండల సర్వసభ్య సమావేశం

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ధర్మవరంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం

ధర్మవరం: ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతో పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్ వద్ద రూ.1.5 కోట్ల వ్యయంతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇస్తూ ప్రభుత్వం శుక్రవారం జీఓ ఆర్టీ 77 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ షాపింగ్ కాంప్లెక్ నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీకి స్థిరాస్తి సమకూరడంతో పాటు ప్రతి నెలా అద్దె రూపంలో ఆదాయం సమకూరనుంది. వ్యాపారులకు సైతం పట్టణ నడిబొడ్డున షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకునే అవకాశం కలుగుతుంది.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

తాడిమర్రి: మండలంలోని ఏకపాదంపల్లిలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, జలాభిషేకం చేశారు. అనంతరం వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించి, కుంకుమార్చన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు కొబ్బరి మట్టలు, పూలమాలలతో అలంకరించిన ఉత్సవ పల్లకీలో విగ్రహాన్ని కొలువుదీర్చి, వీధుల్లో ఊరిగించారు.

ట్రస్ట్ సభ్యుడికి సన్మానం

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలోని గవర్నమెంట్ పాఠశాలలకు రోజూ రాగి జావా ఇచ్చేందుకు సత్యసాయి సెంట్రల్ ముందుకు రావడంతో ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జే రత్నాకర్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్ సూర్యనారాయణ గౌడ్ సన్మానించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌లో నూతనంగా నిర్మించిన శీతలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం హోమాలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అవాహిత సర్వదేవతా మూలమంత్ర జపములు, దీక్షా హోమం, వాస్తుబలి, నవగ్రహ, మండలారాధములు, మధ్యాహ్నం 12:30 గంటలకు నివేదనం, హారతి మంత్ర పుష్పం, దీక్షా హోమం, మూర్తి హోమం తదితర పూజలు చేపట్టారు. అనంతరం అన్నమయ్య సేవా మండలి సభ్యులు పంచమ వాయిద్యం కార్యక్రమం నిర్వహించారు. 12వ తేదీన విగ్రహాల ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నకృష్ణ, బెస్త రామకృష్ణ తెలిపారు.

కోర్కెలు తీర్చే కాటికోటేశ్వరుడు



కాటికోటేశ్వర స్వామి మూలవిరాట్



గుహలోని అక్కదేవతల వద్దకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్లు

- ఈనెల 18, 19 తేదీల్లో చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ నిర్వాహకులు

తాడిమర్రి: కాకిముట్టని తీర్థంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్య క్షేత్రం చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం. ఆలయంలో గల కాటికోటేశ్వర స్వామిని కొలిచిన వారి కోర్కెలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం. తాడిమర్రి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాటికోటేశ్వరక్షేత్రం భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇక్కడ కొండపై గుహలో వెలసిన అక్కమ్మ గార్ల దేవతలు, కాశీ శివ లింగం, నవగ్రహాలు, గదాగుండం భక్తులను ఆకర్షిస్తాయి. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆలయంలో రెండు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత పదేళ్లుగా ఆలయ గుడికట్టు వారి మధ్య వివాదం నెలకొనడంతో ఎప్పుడు ఏమి ఘర్షణలు జరుగుతాయోనని భక్తులు ఉత్సవాలకు రావడానికి భయపడేవారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. గతంలో దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయం చిల్లవారిపల్లి గంగిరెడ్డి వారి ఆధీనంలోకి వచ్చింది. ఆలయ గుడికట్టుదారులను సమన్వయం చేసుకుని ఈనెల 18, 19 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

ఇదీ ఆలయ చరిత్ర..

కాటికోటేశ్వర క్షేత్రానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. పూర్వం గంగిరెడ్డివాళ్లు (కాపులు) జానగానోళ్లు (కురబలు), చిల్లావాళ్లు (బోయలు) మూడు సామాజిక వర్గాల కులదైవం కాటికోటేశ్వరుడు. వారిది ఒంగోలు జిల్లా మార్కాపురం దగ్గర ఒక గ్రామం. వారు పాడిపశువులతో జీవనం సాగించేవారు. అక్కడ వర్షాలు రాక కరువు రావడంతో ఈ ప్రాంతానికి వచ్చి చిత్రావతి సమీపంలో జీవించేవారు. పార్నపల్లి రాజు కోనేటి రాయుడితో వారు యుద్ధం చేసి ఓడించారు. తిరిగి తమ ప్రాంతానికి ప్రయాణమై పోతున్న తరుణంలో వారి ఇలవేల్పు కాటమయ్య స్వామి వారితో పాటు గుర్రంపై బయలుదేరాడు. ఆయన ప్రయాణిస్తున్న గుర్రం కొండ మీద నుంచి కిందకు, అక్కడ నుంచి మరొక కొండ గుహలోకి దూకింది. గుహలో తపస్సు చేస్తున్న మునులు కోపంతో ఇక్కడే శిలగా ఉండిపో అని శపించారు. కాటికోటేశ్వరుడు శిలగా మారడంతో వారు అక్కడ దేవాలయం నిర్మించి పూజలు చేస్తూ వచ్చారు. కొండపైన ఉన్న గుహ నుంచి తిరుపతి వరకూ దారి ఉందని ప్రతీతి.

ఆకట్టుకునే గదాగుండం

ఇక్కడ వెలసిన గదాగుండం (సెలయేరు)లో స్నానాలు చేస్తే సకల పాపాలు హరించి, సకల రోగాలు తొలగిపోతాయని నమ్మకం. పూర్వం పాండవులు అరణ్యవాసంలో ఈ ప్రాంతానికి వచ్చారు. తిరిగి తిరిగి అలసి పోవడంతో.. తాగునీటి కోసం ఎంత వెతికినా ఎక్కడా చుక్కనీరు కూడా కనిపించలేదు. భీముడు కోపంతో భూమిపై గదతో కొట్టగా కొలను ఏర్పడి నీరు వచ్చాయని, దాన్నే గదాగుండం అంటారని పూర్వీకులు చెబుతారు.



గుదాగుండం

కాకిముట్టని తీర్థం..

కాటికోటేశ్వర క్షేత్రంలో కాకులు మచ్చుకైనా కనపడవు. అందుకే ఈ కోనేటిలోని నీటిని కాకిముట్టని తీర్థం అంటారు. పూర్వం గుహలోని అక్కమ్మ దేవతలు జలకాలు ఆడుతుండగా కాకులు వారి వస్త్రాలపై రెట్టలు వేశాయని.. దీంతో వారు కాకులు ఆ ప్రాంతంలో ఉండకుండా శపించినట్లు పెద్దలు చెబుతారు. ఈ క్షేత్రంలో ప్రతి ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. మహాశివరాత్రి రోజున పెద్ద జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్ జిల్లాలతోపాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా వస్తారు. దాడితోట గ్రామానికి చెందిన కొందరు పెద్దలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అన్నదానం నిర్వహిస్తారు.

ఆలయానికి ఎలా వెళ్లాలంటే..

ఈ ఆలయానికి అనంతపురం నుంచి నార్పల మీదుగా పార్నపల్లి బస్సులో వెళ్ళవచ్చు. అలాగే ధర్మవరం నుంచి పులివెందుల బస్సులో దాడితోటకు చేరుకుని.. అక్కడి నుంచి క్షేత్రానికి వెళ్లొచ్చు.

పేదలకు వరం 'వైఎస్సార్ కల్యాణమస్తు'



బుచ్చయ్యగారిపల్లిలో కల్యాణమస్తు మంజూరు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకం పేద కుటుంబాలకు వరమని జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బుచ్చయ్యగారిపల్లి గ్రామ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, గ్రామ సచివాలయాల కన్వీనర్లు ఎల్ఐసీ చంద్ర, లోసారి వెంకట్రాముడు, దామోదర్‌రెడ్డి తదితరులతో కలిసి సచివాలయంలో ఇటీవల నూతనంగా పెళ్లిళ్లు చేసుకున్న జంటలకు కల్యాణమస్తు పథకం సాయం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేశప్ప పాల్గొన్నారు.

భూములను గిరిజనులకు అప్పగించాలి

తనకల్లు: గిరిజన భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ హ్యూమన్ రైట్స్ పరిరక్షణ సంస్థ డిప్యూటీ చైర్మన్ నారాయణ స్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొగలిచెట్లతండా వద్ద ఆక్రమణకు గురైన గిరిజన భూములను పరిశీలించారు. తండా సమీపంలో 1988లో పది మంది గిరిజనులకు ప్రభుత్వం భూ పట్టాలను మంజూరు చేసిందన్నారు. కొందరు వ్యక్తులు ఆ భూములను ఆక్రమించుకున్నారన్నారు. వెంటనే గిరిజన భూములు గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ అనంతపురం, సత్యసాయి జిల్లాల అధ్యక్షుడు జయరామన్న, చెరుకూరి గంగులయ్య, మైనార్టీ నాయకుడు జహంగీర్, జాయింట్ సెక్రటరీ శంకరయ్య, గిరిజన సంఘం నాయకుడు చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గత అసెంబ్లీ ముందు వరకూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి గట్టి పట్టున్న మండలాల్లో ఓడీ చెరువు మండలం ఒకటి. 2019 నుంచి ఆ పార్టీ క్రమంగా బలహీన పడుతూ వస్తోంది. ఓడీ చెరువు మండల పరిధిలోని బాబాసాహెబ్‌పల్లి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. శుక్రవారం పుట్టపర్తి పార్టీ కార్యాలయంలో లక్ష్మీనారాయణ, రంగరాజు, రంగమ్మ, రాజేష్, అశ్వర్థమ్మ, చంద్రమ్మ, వెంకటరమణ, యశ్వంత్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు.

శుభకార్యం..

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో శుక్రవారం జరిగిన పలు శుభకార్యాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. మండల కేంద్రంలో ఉన్న హోటల్ ఖలీల్ కుమారుడు మహమ్మద్ జబీర్, చెమ్మీ వివాహానికి హాజరయ్యారు. గొకవారిపల్లికి చెందిన నాగప్ప కుమారుడు పవన్ కుమార్, పావని వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బుక్కపట్నానికి చెందిన మైనుద్దీన్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్, బుక్కపట్నం, గొకవారిపల్లి సర్పంచులు నాగలక్ష్మమ్మ, గోవిందరెడ్డి, జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, బుక్కపట్నం సొసైటీ అధ్యక్షుడు ఆవుటాల రామలింగారెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ ఖాదిర్, పతంజలి, నాగభూషణ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

హిందూపురం: స్థానిక బాలాజీనగర్‌లోని వెంకటరమణ స్వామి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఆంజనేయులు, ట్రెజరర్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ యశ్వంత్

పుట్టపర్తి: మద్యం, గంజాయి అమ్మకం, రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ అన్నారు. శుక్రవారం బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పాత కేసులను త్వరితగతిన విచారణ జరిపి చార్జ్ షీట్స్ వేయాలని సిబ్బందికి సూచించారు. పేకాట, మత్తు పదార్థాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలపై అత్యాచారానికి పాల్పడితే పోక్సో చట్టం మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. పోలీసులు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువతకు సూచనలివ్వాలని ఎస్‌ఐ నరసింహుడుకు సూచించారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సమస్యలు పరిష్కరించాలని ఆదేశిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ధర్మవరం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 3వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డులో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. పలువురు వార్డు ప్రజలు వీధిలైట్ల కొరత ఉందని వివరించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ వార్డులో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారికి వెంటనే పథకాలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి ప్రజల మన్నన పొందిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కులం, మతం, పార్టీలను చూడకుండా అర్హులైన వారందరికి సంక్షేమాన్ని అందించడం జరుగుతుందన్నారు. ధర్మవరం మున్సిపాలిటిలో రహదారులు, డ్రైన్‌లను దశల వారీగా నిర్మిస్తూ అభివృద్ధిలో జిల్లాలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి, పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఎక్కడైనా చిన్నపాటి అవినీతి ఆరోపణ వచ్చిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తేజ, ఇతర వార్డుల కౌన్సిలర్లు జేసీబీ రమణ, వేముల జయరామిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు బడన్నపల్లి కేశవరెడ్డి, ఉడుముల రామచంద్ర, ఎస్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంపై విస్తృత ప్రచారం

బత్తలపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుకున్న విధంగా రాష్ట్రంలో 175 స్థానాలకు గానూ 175 స్థానాల్లో విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించడం ద్వారా పేద ప్రజలకు సువర్ణ పాలన అందించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ, ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ట



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్పీకుంట: మండల పరిధిలోని గొకనపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం హనుమత్ సమేత సీతారామలక్ష్మణుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరయ్యారు. సర్పంచ్ రామాంజులురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించి, స్వాగతం పలికారు. అనంతరం సీతారాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో నవగ్రహ, గణపతి పూజ, విగ్రహ స్థాపన, మూర్తి హోమం, పూర్ణాహుతి, దేనుదర్శనం, గోదర్శనం, మహా మంగళహారతి నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డికి సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచ్ రామాంజులు రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

నాయనపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని నాయనపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహన సిబ్బంది ఎంపీహెచ్‌ఓ నారాయణస్వామి, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌ఓ ధరణిబాయి తదితర వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు ఇంటింటా పర్యటిస్తూ దీర్ఘకాలిక రోగాలతో మంచం పట్టిన రోగులను పరీక్షించారు. అనంతరం వారు గ్రామస్తులతో మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లలోని నీటి తొట్టెలను శుభ్రం చేసుకుని, ఆరబెట్టుకోవాలన్నారు. దోమల వ్యాప్తి తగ్గుతుందని సూచించారు.

గృహ సారథులే జగనన్న రథసారథులు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాప్తాడు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే జగనన్న రథసారథులని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాప్తాడులోని నూతన సచివాలయ భవనం దగ్గర ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అధ్యక్షతన మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామ స్థాయికి తీసుకువెళ్లారన్నారు. నవరత్నాల పథకాల ద్వారా జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి పని చేయాలన్నారు. ఒక్కో కుటుంబాలకు చేకూరిన లబ్ధి, వార్డు, మండలం, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. వంట గ్యాస్, పెట్రోలు, గీజిల్ ఇతర నిత్యావసరాల పెరుగుదల అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, టీడీపీ పాలనలోని వైఫల్యాలను వివరించాలన్నారు. అందుకు మీరంతా జగనన్న కుటుంబంలా పని చేయాలన్నారు. 2024లో ఎన్నికలే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తే మరో 25 ఏళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం తథ్యమన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ఏ విధంగా పార్టీకి పనిచేశారో మరో ఒకటిన్నర సంవత్సరం పాటు రెచ్చించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఈ నెల 20 నుంచి 27 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలవడం ఖాయం

టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లు విజయం సాధించడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏది చెప్పినా కచ్చితంగా చేసి తీరుతారన్నారు. ఇప్పటికే 98 శాతం హామీరు నెరవేర్చారని, కులం, మతం, ప్రాంతం పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. అందువల్ల జగనన్నను మరోసారి సీఎంగా చూసేందుకు అందరం కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' గృహ సారథులకు ప్రభుత్వ పథకాల ప్రచార సాధన కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజల అభీష్టం మేరకు వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ విభాగం మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ కేశవ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి తదితరులు హాజరయ్యారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కనగానపల్లి: డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ డివిజనల్ మలేరియా అధికారి జయరాం నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని తగరకుంట గ్రామంలో ఆరోగ్య సిబ్బంది డ్రైడే నిర్వహించారు.